క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న హెచ్‌సీ రమణ

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ విజయకుమార్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రమణ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. స్టేషన్ సిబ్బంది రౌడీషీటర్ల దిన చర్య గురించి తెలుసుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని హితవు పలికారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్‌లో లైన్ క్లియర్‌లో భాగంగా ఏఎల్ 59 జీబ్రా కండక్టర్ మార్పిడి పనుల నిమిత్తం సోమవారం నుంచి బుధవారం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతినగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాపూజీ నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, జగ్జీవన్ నగర్, పెదకొత్తూరు, అంబేడ్కర్ ఎస్టేట్, జయప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ఈ మూడు రోజులూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన ఘటన జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పెదగంట్యాడలో నివసిస్తున్న జి.రాజేశ్వరి 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఎంజీ సర్వీస్ కంపెనీలో బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 8న 104 ఏరియా వద్ద సాయంత్రం రోడ్డు దాటుతుండగా కంచరపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సురక్ష ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజేశ్వరి కుమారుడు జి.యశ్వంత్ కుమార్ ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ నేతృత్వంలో ఎస్ఐ ఉల్‌హక్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎర్నిమాంబకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం కార్తీక మాసం ఆదివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేష్‌బాబా నేతృత్వంలో ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ పర్యవేక్షించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో రైలు కింద పడి సుమారు 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల తెలిపిన వివరాలు... మృతుని శరీరంపై నీలం రంగుల గీతలు గల షర్టు, క్రీమ్ కలర్ ఫ్యాంటు ఉన్నాయి. వివరాలు తెలిసినవారు రైల్వే పోలీస్ ఎస్ఐ 94934 24987, సీఐ ధనుంజయ్ నాయుడు 9440627547 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

ఇళ్లు కళకళ



అజయ్‌కలాంనగర్‌లో ఆధునీకీకరించిన ఇళ్లు



నెహ్రూ నగర్‌లో మరమ్మతుల అనంతరం కళకళలాడుతున్న గృహ సముదాయం

- బర్మా కాందిశీకుల శిథిల గృహాలకు మోక్షం
- 20 ఏళ్ల ఎదురుచూపులు ఫలించిన వేళ
- జీవీఎంసీ నిధులు రూ.1 కోటితో ఆధునికీకరణ
- 786 ఇళ్లకు మరమ్మతులు, నూతన నిర్మాణాలు
- సీఎం వైఎస్ జగన్‌పై కాలనీవాసుల ప్రశంసల జల్లు

పేదల బతుకులు బాగుచేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం. వారికి కనీస అవసరాలైన కూడు, గూడు, విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. పేదవారికి నూతన గృహాలు నిర్మించడంతోపాటు ప్రస్తుతం వారు నివసిస్తున్న కాలనీలను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రజల ప్రతి సమస్యనూ పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని బర్మా కాందిశీకుల నివాస గృహాల మరమ్మతులు, వాటిని నిలబెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. స్థానిక కార్పొరేటర్ అల్లు శంకరరావు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు సహకారంతో బర్మా కాందిశీకుల గూడు నిలబెట్టారు. శిథిలావస్థలో ఉన్న గృహాలకు మరమ్మతులు చేయించారు. దీంతో బర్మా కాందిశీకులు జగనన్నకు రుణపడి ఉంటామంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



నూతనంగా నిర్మించిన స్టెయిర్ కేస్, మెట్లు

జీ+1 పద్ధతిలో గృహాల నిర్మాణం

నెహ్రూనగర్‌లో 1988 నవంబర్‌లో జీ+1 పద్ధతిలో 250 ఇళ్లు నిర్మించి నిర్వాసితులకు అందించారు. రెండో విడతలో భాగంగా 1992–93లో 450 గృహాలను మొత్తంగా నాలుగు బ్లాకుల్లో నిర్మించారు. మూడో దశలో అజయ్‌కలాం కలెక్టరుగా ఉన్నప్పుడు 186 ఇళ్లు ఇచ్చారు.

జగనన్న విన్నారు.. కల నెరవేర్చారు

గతంలో నిర్మించిన ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపం కారణంగా ప్లాట్లు క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో తుపాను, వర్షాల సమయంలో నివాసులు నానా అవస్థలు పడేవారు. రెండు సార్లు స్టెయిర్ కేస్‌లు, మెట్లు కూలిపోయాయి. వీటిని దాతల సాయంతో పునరుద్ధరించారు. అవి నాసిరకంగా ఉండటంతో వీటికి మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు ప్రభుత్వ పెద్దలకు విన్నవించారు. 2002 నుంచి వీరు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. రెండు దశాబ్దాలకు పైగా పరిష్కారం కాని బర్మా కాందిశీకుల సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రాంత కాందిశీకుల గోడు విని ఇళ్లను బాగుచేయించారు.



నాడు: నెహ్రూనగర్‌లో రక్షణ గోడల పరిస్థితి



నేడు: నెహ్రూనగర్‌లో ఇళ్లకు రక్షణగా నిర్మించిన గోడలు



నిధులు.. పనులు

బర్మా కాందిశీకుల గృహాల ఆధునికీకరణకు మొదటి విడతగా రూ.59 లక్షలు, రూ.40 లక్షలు.. మొత్తం రూ.99 లక్షల జీవీఎంసీ నిధులను వినియోగించారు. వీటితో 786 ఇళ్లకు మరమ్మతులు చేసి నిలబెట్టారు. స్టెయిర్ కేస్‌లు, ప్రొటెక్షన్ వాల్స్, ప్లాస్టింగ్స్, శ్లాబ్ ఎకో ప్రూఫ్ ప్లాస్టింగ్, సన్‌షేడ్స్, ఎలివేషన్, బ్రిక్ వర్క్ చేశారు. పోర్టుకోలు నిర్మించారు. కామన్ ఏరియా ప్లాస్టింగ్, బ్రిక్ వర్కు, మెట్లు నిర్మించారు. బ్రిక్ వాల్స్ నిర్మించారు.

మా బతుకులు నిలబెట్టారు



మా ఇళ్లు కూలిపోతాయేమోనని భయపడేవారం. వర్షం వస్తే మా ప్రాంత నివాసులు భయంతో బతికేవారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులు చేయించి ఇళ్లు నిలబెట్టాలని వినతులు అందించినా నెరవేరలేదు. జగనన్న ప్రభుత్వంలో కార్పొరేటర్ అల్లు శంకరరావు ప్రత్యేక శ్రద్ధ, కె.కె.రాజు సహకారంతో మా ఇళ్లకు మరమ్మతులు చేయించి. మా బతుకులు నిలబెట్టారు.

– బి.దివ్య, అజయ్‌కలాం నగర్

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం



ఇళ్ల మరమ్మతుల వల్ల మా బతుకులకు గ్యారెంటీ లభించింది. మా గృహసముదాయంలో మెట్లు కూలిపోయినప్పుడు మా కుటుంబం చాలా ఇబ్బందులు పడింది. దాతల సాయంతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. స్టెయిర్ కేస్‌లు లేకపోవడం వల్ల పైనుంచి దిగాలంటే భయం వేసేది. సన్‌షేడ్‌లు ఉండేవి కాదు. ప్రస్తుతం ఈ సౌకర్యాలన్నీ కల్పించారు. కొత్తగా నిర్మించిన ఇళ్ల మాదిరిగా తయారు చేశారు. సీఎం జగన్ బాబుకు రుణపడి ఉంటాం.

– సంబంగి కొండమ్మ, నెహ్రూ నగర్

వైద్య శిబిరాలకు విశేష స్పందన



వరాహగిరి కాలనీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం



మురళీనగర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ, సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతాల నివాసుల కోసం వరాహగిరి కాలనీలో అసోసియేషన్ ఆఫ్ డాక్టర్స్ కేర్ ఫర్ యూ ఆధ్వర్యంలో గణేష్ కొమ్మోజు సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ మెడిసిటీ హాస్పిటల్, హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, స్ఫూర్తి ఐ క్లినిక్‌ల సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో క్యాన్సర్, కళ్లు, దంతాలు, బీపీ, సుగర్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సుమారు 200 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, డాక్టర్ విశ్వంత్, డాక్టర్ పి చార్లెస్ మేగ్నె, డాక్టర్ వి.జాహ్నవి, అసోసియేషన్ ఆఫ్ డాక్టర్ కేర్ ఫర్ యూ వ్యవస్థాపకులు, సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి, నారాయణరావు, నారాయణ మెడిసిటీ ప్రభాకర్, సతీష్, మానస, సత్యసాయినగర్ కాలనీ ప్రెసిడెంట్ కారుకొండ రాజు యాదవ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

మురళీనగర్: జిమ్‌సర్ ఆస్పత్రి సౌజన్యంతో మురళీనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గైనిక్, జనరల్, చిన్న పిల్లలు, గుండె, చర్మ, ఈఎన్‌టీకి సంబంధించిన సమస్యలపై 40 మందితో కూడిన వైద్య బృందం పరీక్షలు చేసింది. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన 400 మంది వైద్య సేవలు పొందారు. సోమవారం ఉచిత బస్సు ఏర్పాటు చేసి గీతం ఆస్పత్రిలో మరికొన్ని పరీక్షలు చేస్తామని, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మానవ హక్కుల ఉల్లంఘన బాధాకరం

దాబాగార్డెన్స్: ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని దామోదర సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ నేతృత్వంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు కల్పించిందన్నారు. అయితే ఆ హక్కులు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా చైర్మన్, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, మానవ హక్కుల ప్రతినిధులు ఎస్వీ రమణ, సోమసుందరరావు, బి. మల్లేశ్వరరావు, నక్కాని అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. 'విశాఖ వ్యాలీ స్కూల్ గ్రాండ్ మాస్టర్ గిల్డ్ ఇంటర్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్–2023'పేరుతో నిర్వహించిన ఈ పోటీలను కలెక్టర్ సతీమణి డాక్టర్ పి.ఎస్.నిహారిక ప్రారంభించారు. అనంతరం పిల్లల ఆట తీరును పరిశీలించారు. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఆడుతున్న పిల్లలను ఆమె అభినందించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ పోటీలలో నగరంలో విశాఖ వ్యాలీతో పాటు టింపనీ, డీఏవీ పబ్లిక్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్, కేవీ–1, 2, శారదా విద్యానికేతన్, సిల్వర్ ఓక్స్, ఓక్రిడ్జి, నారాయణ, శ్రీచైతన్య తదితర 32 పాఠశాలలు నుంచి 392 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలను నాలుగు కేటగిరీల్లో నిర్వహించారు. కేటగిరి–1లో ఎల్‌కేజీ నుంచి మూడో తరగతి, కేటగిరి–2లో 4 నుంచి 6వ తరగతి, కేటగిరి–3లో 7 నుంచి 9వ తరగతి, కేటగిరి–4లో 10 నుంచి 10 ప్లస్ టు వరకు పోటీలు నిర్వహించారు.

ప్రతి కేటగిరి నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికల చొప్పున ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.




చదరంగం పోటీలు ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ సతీమణి నిహారికా

జంగమ కుటుంబ ఐక్యతను పెంపొందించాలి

మర్రిపాలెం: జంగమ కుటుంబ ఐక్యతను పెంపొందించాలని జంగమ సేవా సంఘం అధ్యక్షుడు శృంగారకవి మహేశ్వరరావు అన్నారు. 51వ వార్డు మాధవధార మామిడి తోటల్లో సంఘ ఆధ్వర్యంలో ఆదివారం కుటుంబీకుల ఆత్మీయతను పెంపొందించేందుకు కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ప్రతి ఏడాది జంగమ కుటుంబాల కలయికకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సంఘం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం అక్కడ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. వివిధ తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు పోలంకి వెంకట సత్య రమేష్, కార్యదర్శి పూడి ఈశ్వరరావు, కోశాధికారి అత్తిలి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయం



మాట్లాడుతున్న వెంగళరావు యాదవ్

మురళీనగర్: బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా రథయాత్ర నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్.వెంగళరావు యాదవ్ తెలిపారు. బిర్లా కూడలి కేరళ కళా సమతిలో ఆదివారం నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బీసీలకు 90 అసెంబ్లీ స్థానాలు, 13 పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లవుతున్నా బీసీలకు రాజ్యాధికారం రాకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జి–మహిళా అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి, పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

ముగిసిన కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు



విజేతలతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆదారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు



ఫైనల్స్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు జన్మదినోత్సవంలో భాగంగా ఈ నెల 8న పోర్టు హాస్పిటల్ ఎదురుగా ప్రారంభమైన కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు విచ్చేశారు. విశాఖ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది జిల్లా మెన్ అండ్ వుమెన్ సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023ను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా ఎస్‌టీసీ సాయి నిలువగా, రన్నర్లుగా లక్కీ బాక్సింగ్ క్లబ్ వారు నిలిచారు. విజేతలకు కె.కె.రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. ముగింపు కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కె.వి.ఎస్.శశికళ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, ద్రోణంరాజు అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వర్లు, ఏపీ స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ బి.లక్ష్మణ్‌దేవ్, ఆర్వోసీ సెక్రటరీ బి.నాగేశ్వర్, ఆర్గనైజర్ నీలి రవి, నిర్వాహకుల మామిడి శ్రీను, ఎన్‌టీఆర్ రెడ్డి, బులుసు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి కృషి




యుద్ధంలో అసువులు బాసిన వారికి సంతాపం తెలుపుతున్న సంస్థ ప్రతినిధులు

సీతమ్మధార: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోని, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సెమినార్ నిర్వహించారు. ముందుగా ఇజ్రాయిల్, పాలిస్తీనా యుద్ధంలో అసువులు బాసిన వారికి సంతాపం తెలిపి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆచార్య పి.డి.సత్యపాల్, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, హక్కుల కార్యకర్త డాక్టర్ ప్రియాంక, డాక్టర్ పి.కె.జోష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పటిష్టతతో హక్కులకు రక్షణ

సీతమ్మధార: ప్రజాస్వామ్యం దిగజారుతున్నప్పుడు హక్కుల ఉల్లంఘన జరగడం సహజమని ఆంధ్ర విశ్వవిద్యాలయం లా విభాగం ప్రొఫెసర్ ఎల్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలు ప్రజాస్వామ్య వ్యవస్థ దిగజారుడుతనం వల్లే జరుగుతున్నాయన్నారు. దేశంలోని పౌరులు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారన్నారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉంటే హక్కుల ఉల్లంఘన జరగదని పేర్కొన్నారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ ఎల్.వి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఏయే దేశాల్లో ఏరకంగా సంక్షేమానికి పాటుపడుతున్నది గ్రహించాలన్నారు. వ్యవస్థలో కూలంకుశంగా దీనిపై చర్చ జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు కుప్పిలి మురళీధర్, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్.వి.సుమన్, సంస్థ కార్యదర్శి బగాది తులసీదాస్, సభ్యులు సునీత, నిర్మల, శ్రీదేవి, ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఐక్య క్రిస్మస్ వేడుక



క్రిస్మస్ వేడుకల్లో శ్రీధర్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని వైఎస్సార్‌సీపీ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, సెయింట్ పీటర్స్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జ్యోతి నిలయంలో మాన్యువల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధుల ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారిని అసోసియేషన్ అధ్యక్షుడు సబ్బవరపు మాణిక్యాలరావు నేతృత్వంలో సత్కరించారు. కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పలువురు వృద్ధులను సన్మానించారు. తన సొంత నిధులతో సుమారు 800 మందికి భోజనాలు, వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో సభ్యులు ఇరోతి మరియదాస్, రాజాన శ్రీను, శ్యామ్‌సుందర్, కమల్, అన్నపూర్ణ, దేవి, మాన్యువల్ వెల్ఫేర్ సభ్యులు, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.